**1989 దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

# సృష్టిలో తీయనిది....

''నువ్వింత నమ్మకద్రోహం, మిత్రద్రోహం చేస్తావని అనుకోలేదురా సాంబా!''

గౌరీపతి వస్తూనే మనిషికంటే ముందుగా వదిలిన మాటలవి! ''ఏవిట్రా! ఎండమీద చిరాకు నామీద చూపిస్తున్నావా? లేక.. నాతో పోట్లాడాలని సరదా పుట్టిందా?'' అడిగాను నేను తింటున్న తాటిముంజెల్లో రెండు వాడివైపు తోస్తూ. ఎప్పట్లా వాడు కూర్చోలేదు.

తలెత్తి చూశాను.

వాడిమొహంలో చాలా మార్పు ఉంది. కోపంగా ఉన్నాడు. ఆవేశపడుతున్నాడు కూడా! నాకు అమితాశ్చర్యం కలిగించే విషయం ఇది. ఈ నలభై ఏళ్ళలో వాడినీవిధంగా చూడ్డం ఇదే మొదటిసారి!

''నిజంగా కోపంగా ఉన్నావేమిటిరా గౌరీ?... ఇంతకీ ఎందుకురా నీకు కోపం వచ్చింది?'' సామవయంగా అడిగాను.

''ఏం తెలియనట్లు మాట్లాడకు'' చాలా విసురుగా అన్నాడు.

''మన విషయమే అయితే తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం కాని ముందివి కానిచ్చు! ఎండనపడి వచ్చావు'' వాడికోపం తీసిపారేస్తూ చెప్పాను.

''నువ్వు చేసిన మోసానికి నీ ఇంట్లో పచ్చి మంచి నీళ్ళు కూడా తాగదల్చుకోలేదు'' అదేస్థాయిలో అన్నాడు.

''గౌరీ!.....?'' వాడి వైఖరికి ఆశ్చర్యపోతూ చేతిలో ముంజెలు వదిలేసి లేచి నిల్చున్నాను. చేతులు కడుక్కుని తుడుచుకుంటూ, ''అసలు సంగతేమిటో చెప్పరా!'' అడిగాను మళ్ళీ లాలనగా.

''వేపచెట్టు నాకు కావాలని చెప్పావా? లేదా?'' సూటిగా అడిగాడు.

''ఓరినీ! అద్రటా నీ గొడవ! ఇంకా ఏమిటో అనుకున్నాను. కాస్త ఎండ తగ్గాక నేనే వచ్చి నీకు చెప్పాలనుకుంటున్నాను ఈలోగా నువ్వే వచ్చావు... స్థలం, చెట్టు కలిపి వాళ్ళకే అమ్మేశాడురా బాబాయి..

''అదే అడుగుతున్నాను. చెట్టు నేను కొంటాను..'' చెట్టు మినహాయించి మరీ స్థలం అమ్మించు! అని నేను చెప్పాక నువ్వు ఎలా అమ్మనిచ్చావు? అని అడుగుతున్నాను'' ముక్కుపుటాలు ఎగరేస్తూ నన్ను నిలదీసి మరీ అడుగుతున్న వాడికి ఎలా జవాబు చెప్పాలో అర్థంకాలేదు నాకు.

''ఒరేయ్ గౌరీ! ఇలా మా వాడికి కావాలి అని చెప్పగలను కాని మా వాడికే ఇయ్యి అని శాసించలేను కదరా'' ఈ మాటలు నాకు చెప్పకు! నీ మాటంటే మీ బాబాయికెంత గురో నాకు బాగా తెలుసు! నిన్నుకాదని ఎవరికో ఇచ్చేశారంటే నేను నమ్మను.



ఇన్ని మాటలెందుకులే! ఆ చెట్టు నాకు అమ్మడం నీకే ఇష్టం లేదు నువ్వే..."

"ఒరేయ్ గౌరీ! ఏం మాటలురా అవి! ఆ చెట్టు నీకు రాకుండా పోతే నాకేం లాభంరా! నిజానికి నీకు లాభం కలిగితే సంతోషించే వాళ్ళల్లో నేనే కదరా ప్రథముడివి".

"వాళ్లే ఇన్నాళ్లూ నేనూ అదే భ్రమలో ఉన్నాను. .."

"నువ్వు చాలా అపోహ పడుతున్నావురా గౌరీ!"

"లేదు లేరా! ఇప్పుడే అర్థం చేసుకుంటున్నాను'

"వద్దురా! అంతంత మాటలని నా మనసు కష్ట పెట్టకు"

"నీకు నాకు రాం! రాం! అయ్యాక నేను నీ మనసు కష్టపెట్టేది లేదు. నువ్వు నన్ను సంతోష పెట్టేది లేదు"

"ఏం మాటలురా అవి హాస్యానిక కూడా అనకు రా! వెధవది ఆ చెట్టు కోసం మన నలభై ఏళ్ళ స్నేహాన్ని వదులుకోడానికి సిద్ధపడుతున్నావా?" ఆశ్చర్యపోతూ అడిగాను.

"నలభై ఏళ్ళ స్నేహానికి మరి నువ్విచ్చిన విలువ ఏమిటి?" తడుముకోకుండా వెంటనే అడిగాడు.



మా స్నేహం విలువ, ఆ చెట్టు వాడికి వచ్చేలా చెయ్యడంలోనే ఉంది అని వాడు అనుకుంటే నేను చెయ్యగలది, చెప్పగలిగింది ఏమీ లేదు.

అయినప్పటికీ తర్వాత చాలా సేపు వాడికి నచ్చచెప్పడానికి ప్రయత్నించాను. బతిమాలాను. నిజంగా నేను ద్రోహం చేశానని అనుకుంటే జరిగిన పొరబాటుకి మన్నించమన్నాను.

వూహూ దేనికీ ప్రసన్నం కాలేదు వాడు. ముంజెలు తినక పోతే పోనీ, కనీసం కూర్చోకుండానే వెళ్ళిపోయాడు. వాడి ధోరణి చూస్తే నిజంగానే రాం! రాం! అనేట్టున్నాడు.

ఎండబాగా తగ్గాక పొలం వెళ్ళాను. కాలవకి ఆ పక్క గౌరీపతి పొలం, ఈ పక్క నా పొలం. ఇద్దరం కలిసే మా ఇద్దరి పొలాల వ్యవహారాలు చూస్తాం! వేరే పనుల మీద ఊళ్లో లేనప్పుడు తప్ప సాధారణంగా కలిసే పొలం వెళ్ళి వస్తూ ఉంటాము. వెళ్ళడంలో అటు ఇటు అయినా రావడం మాత్రం కలిసే వస్తాం! ఇళ్ళు కూడా వీధికి ఈ చివర వాడి ఇల్లు! ఆ చివర నా ఇల్లు!

చీకటి పడిపోయింది గౌరీపతి జాడలేదు.

'ఇంకా ఏం చేస్తున్నాడో?' లేచి వాడి పొలం కేసి వెళ్ళాను. జీతగాడు ఈతగెలలు కోస్తున్నాడు.

"మీ కామందు ఎక్కడరా?"

"ఇందాకనే ఎల్లిపోనారయ్యా!" చెప్పాడు వాడు ఆశ్చర్యంగా చూస్తూ.

మరి మా మధ్య అనుబంధం, మా దినచర్య. అంతా జీతగాళ్ళతోసహా అందరికీ తెలుసు.

'వెళ్ళిపోయాడా?' అయితే ఇంకా కోపం తగ్గలేదన్న మాట!

** ** **

రాత్రి భోజనానంతరం అలవాటుగా కాళ్ళు గౌరీపతి ఇంటి కేసి నడిచాయి.

వాడికోపం ఎలాగయినా పోగొట్టాలి! ఇంత వయస్సు వచ్చినా వెధవ కుర్రతనం వీడూనూ. చిన్నప్పట్నించీ ఇంతే! ఆవేశం ఎక్కువ! ఇట్టే కోపం వచ్చేస్తుంది!

మెట్లెక్కుతూ ఉండగానే పనసపండు వాసన ఘుమాయించింది. నాకు నోరూరింది.

'వెధవ! ఎంతకోపం వచ్చినా నా కోసం పనసపండు కోయిస్తున్నాడు...'

మరి ఈ నాటి స్నేహమా మాది! నలభై ఏళ్ళ వయసు దానికి. అప్రయత్నంగా నా చెయ్యి మీసం మీదకి వెళ్ళింది. పెరటి సావిట్లో ఉన్నారు అంతా! గౌరీపతి తండ్రి, పిల్లలు పెరట్లో మంచాలమీద పడుకున్నారు. గౌరీపతి భార్య పండుకోసి తొనలు

రాంపల్లి వసుంధర

## మీరిక నన్ను ప్రేమించరు

మీరిక నన్ను ప్రేమించరు
మీరిక నాకు గడ్డి గాదం పెట్టడానికీ
నన్ను చూడ్డానికి కూడా ఇష్టపడరు
మీకు తెలుసు—
ఇక
నా నుండి పిల్లల్నీ, పాలనీ పొందలేరని
అందుకే
మీరిక నన్ను ప్రేమించరు
ప్రేమించకపోవడమే కాదు
మీరిక నా చావుకోసం నిరీక్షిస్తారు
నే చస్తే
నా ఎముకలతో మీరు గుండీలు,
ప్లేట్లు, చేసుకోవచ్చని
నే చస్తే
నా చర్మంతో మీ వాయిద్యాలు
మోగించుకోవచ్చని
అందుకే
మీరిక నన్ను ప్రేమించరు

—జింబో

నలుస్తోంది!

ఆ పక్కనే కూర్చున్న వాడల్లా, నన్ను చూస్తూనే లేచి మేడమీదకి వెళ్ళిపోయాడు గౌరీపతి! గదిలోకి వెళ్ళి తలుపులు కూడా వేసుకున్నాడు.

నాతో బాటు అతని భార్య కూడా ఆశ్చర్యపోయింది వాడి చర్యకి. అభిమానం చంపుకుని నేనెంతసేపు కూర్చున్నా వాడు రాలేదు. వాడి భార్య ఎంత బలవంతం పెట్టినా నాకు అమిత ఇష్టమైన వాడింటి పనస తొనలు నోట పెట్ట బుద్ధికాలేదు.

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. 'వీడెందుకిలా ప్రవర్తిస్తున్నాడు?' ఇదంతా చెట్టు తనకి ఇవ్వలేదనేనా? అయితే మాత్రం జరిగిన దానికి ఇంత మొండి పట్టుదలా? నేనెరిగున్న గౌరీపతి కాదువీడు.

ఈ మధ్య వీడికి కాస్త వ్యాపార లక్షణాలు, డబ్బు యావ పట్టుకుందని గమనించాను గానీ మరీ ఇంతలా ఊహించలేదు. ఆ చెట్టు మా మధ్య ఇంత గొడవ తేగలదని అనుకోలేదు.

గౌరీపతి పెరటివైపు భాగంలో మా పినతండ్రి స్థలం ఉంది. ఆ స్థలం అమ్మేయాలని అనుకున్నాడు బాబాయి. ఓ రోజు నన్ను పిలిచి ''అబ్బాయ్ సాంబా! కాస్త ఈ స్థలం సంగతి చూడరా! ఎంతరేటు పలుకుతుందో జాగ్రత్తగా చూసి మరీ అమ్మాలి! మనస్థలంలో ఉన్న ఆ వేపచెట్టుకి కూడా మంచి ధర వస్తుంది. రెంటికి కలిపి మంచి ధర పలికేలా చూడు'' అన్నాడు

సంగతి తెలియగానే గౌరీపతికి సలహా ఇచ్చాను. ''నీ ఇంటికి ఆనుకుని ఉంది నువ్వు కొనేసుకోరా! కలిసొస్తుంది'' అని.

కాని వాడి జాతకరీత్యా ఆ స్థలం కొంటే అచ్చిరాదని చెప్పాడు.

''కాని సాంబా! చెట్టు మాత్రం నేనుకొంటాను రా! నాకు కావాలి!'' అన్నాడు గౌరీపతి.

''సరే బాబాయి ఊరెళ్ళాడు. రాగానే ఈ విషయం సెటిల్ చేసేద్దాం!'' అన్నాను.

ఇంకా నేను బాబాయికి చెప్పకుండానే స్థలం చూడ్డానికి వచ్చిన వాళ్ళతో 'చెట్టు మినహాయించే స్థలం చెట్టు అమ్మకం అయిపోయింది' అని చెప్పసాగాడు గౌరీపతి.

బాబాయి ఊర్నించి రాగానే గౌరీపతికి చెట్టు కావాలనే విషయం చెప్పాను.

''ఎంతిస్తాడేమిటి నీ స్నేహితుడు?'' రెండు వేలు విలువ చేసే చెట్టు అది'' అన్నాడు బాబాయి.

''వాడికి మాత్రం తెలియదా, అంత బ్రహ్మాండమైన మహావృక్షం ఎంత ధర పలుకుతుందో? ఓ వంద అటూ ఇటూ అయినా సరే వాడికే ఇచ్చేద్దాం బాబాయి!'' చెప్పాను వాడి తరఫున వకాల్తా తీసుకుని.

''సరేలే ఎంతయినా నీ స్నేహితుడు కదా! పోనీయ్!'' అన్నాడు బాబాయి నవ్వి.

వెంటనే గౌరీపతిని కల్సి ''ఎంతిస్తున్నావు? బాబాయికి మాట మాత్రం చెప్పాలి కదా!'' అన్నాను.

''ఐదారొందలు ఇస్తాలేరా!'' అన్నాడు తేలిగ్గా.

తెల్లబోయాను. బాబాయేమో రెండు వేలు సునాయాసంగా వస్తుందంటున్నాడు. వీడేమో ఆరొందలు తక్కువేమీ కానట్టు చెపుతున్నాడు. ఆరువందలు అస్సలు కిట్టుబాటు కాని ధర! లేదంటే మరో వందిస్తానంటాడు. రెండు వేలు కాకపోయినా పదిహేను, పదహారు వందలు మాత్రం సునాయాసంగా వస్తాయి. ఇటు స్నేహితుడు, అటు బాబాయి, వీడిని నొప్పించలేను. బాబాయిని నష్టపెట్టలేను. ఏం చెయ్యాలి? ఆలోచించి ఆలోచించి అర్జెంటుగా ఊరెళుతున్నానని ఈ విషయం బాబాయితో స్వయంగా సెటిల్ చేసుకోమని చెప్పి తాత్కాలికంగా నేను తప్పుకున్నాను.

బాబాయికి ఇష్టం ఉంటే ఇస్తాడు. లేదంటే ఇవ్వనని ఖచ్చితంగా చెప్పేస్తాడు. నేనంత ఖరారుగా మాట్లాడలేను వాడితో.

రెండో రోజు నేను ఊళ్ళో దిగుతూనే బాబాయి మా ఇంటికి వచ్చి ''ఏమిట్రా అబ్బాయ్! నీ స్నేహితుడు రెండు వేలు విలువ చేసే చెట్టుకి ఆరువందలు చేసుకోండి, ఏడు వందలు చేసుకోండి అంటాడు. వాడేమయినా వెర్రి వెధవా? లేకపోతే నన్ను పిచ్చి ముండావాడ్ని అనుకుంటున్నాడా?'' అంటూ నామీద ఎగిరిపడ్డాడు.

బాబాయి వెళ్ళిన కాసేపటికి గౌరీపతి వచ్చాడు. ''ముసలాయనకి అంతాశ ఏమిట్రా? నాలుగయిదొందలు ఖరీదు చేసే చెట్టుకి రెండు వేలు ఎవరిస్తారనుకుంటున్నారు?'' అన్నాడు. నేనేమీ మాట్లాడలేదు.


మళ్ళీ వాడే, ''నువ్వు చెప్తే మీ బాబాయి వింటాడు. ఆరుదాకా అన్నాను. పోనీ మరో పాతిక ముప్పై అయినా ఆ చెట్టు మాత్రం నాకే వచ్చేలా చూడు'' అన్నాడు.

''నేనేం చెయ్యనురా? నా సొంతం కాదు. నాదే అయితే బేరంలేదు సారం లేదు నువ్వు ఇలాకావాలి అనగానే కొట్టేసుకోరా అనేవాడిని'' అన్నాను.

''అదంతా నాకు తెలియదు నువ్వు చెప్పేలా చెప్పాలి ఆ ముసలాయనకి. నీ మాట వింటాడు'' అంటూ గట్టిగా చెప్పి వెళ్ళాడు గౌరీపతి. ఇదెక్కడి సంకటస్థితిరా బాబూ! అనుకున్నాను.

మర్నాడు నేను స్నానానికి చెరువుకేసి వెళ్తూ ఉంటే బాబాయి పిలిపించాడు.

ఇంట్లో ఇంతకుముందు స్థలం చూసి వెళ్ళిన పెద్ద మనుష్యులున్నారు. ''ఇదిగో అబ్బాయ్! వీళ్ళు



మనస్థలం, చెట్టూ కూడా తీసుకుంటున్నారు. మాటలన్నీ అయ్యాయి! ఖరారయిపోయింది. మళ్ళీ వీరు ఊరు వెళ్ళిపోతారట. ఈరోజే రిజిస్ట్రేషన్ కావాలి. వెంటనే బయలుదేరు'' అని చెప్పాడు. స్థలానికి ఆరు వేలు, చెట్టుకి పదహారు వందలు చొప్పున అమ్మకం జరిగిపోయింది.

మరి పదహారు వందలు వచ్చిన చెట్టుకి ఐదుకీ, ఆరుకీ ఇమ్మంటే బాబాయి మాత్రం ఎలా ఇస్తాడు?

అది సామాన్యమైన చెట్టుకాదు. మహా వృక్షం.

పనిపూర్తి చేసి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. బడలికగా ఉండి పొద్దుట పొలం కూడా వెళ్ళలేదు. ఈలోగా విషయం గౌరీపతికి తెలియడం వాడు నన్ను అపార్థం చేసుకోడం జరిగిపోయింది.

అర్థరాత్రిదాకా నాకు నిద్రపట్టలేదు.

** ** **

చెరువుకి వెళ్ళి వస్తూ ఉంటే గౌరీపతి పెరటివైపు పాటకజనం గట్టిగా అరవడం విని అటు వెళ్ళాను. ఇద్దరు మనుష్యులు బాబాయి స్థలంలోని చెట్టును నరుకుతున్నారు. చెట్టు క్రింద ఉన్న మరో నలుగురు ఆ చెట్టు నరకటానికి వీల్లేదని గొడవచేస్తున్నారు.

''ఎందుకు గొడవ? ఏమిటి సంగతి?'' అని అడిగాను.

''సూడండయ్యా! ఈ సెట్టు గౌరీపతి బాబుగారు మాకు అమ్మేసినట్టు మాటిచ్చారు. రెండు రోజులాగి రండి, కొట్టేసుకుందురు గాని అని మొన్న కూడా సెప్పినారు. ఈరోజు ఈ లొచ్చి సెట్టు నరికేస్తున్నారు... ఏందిరా? అంటే.....''

వాళ్ళ గోలగా చెప్తూ ఉంటే మధ్యలో చెట్టు మీంచి ఒకడు క్రిందకి ఉరికి, ''ఈ సెట్టు గలాయన నాకు కూలి మాట్లాడి సెట్టు నరకమని చెప్పినారు. మా పని మేము చేస్తూంటే మద్దెలో ఈళ్ళొచ్చి....''

మళ్ళీ రెండు వర్గాలు ఘర్షణలోకి దిగారు.


'చెట్టు గౌరీపతి అమ్ముతాననడం ఏమిటి? నాకు అర్థం కాలేదు. ఇందులో ఏదో పొరబాటు ఉంది. ''ఆగండి! కాస్సేపు గొడవ పడకండి! ఏం చెయ్యాలో నేను చెప్తాను'' అని వాళ్ళకి సర్ది చెప్పి నేను గౌరీపతి ఇంటివైపు నడిచాను.

గౌరీపతి తమ్ముడు విశ్వనాథం ఎదురు వచ్చాడు.

''అన్నయ్య పొలంలో ఉన్నాడు. వెళ్ళి అక్కడ మాటాడుకోండి! ఇక్కడ గొడవ చెయ్యొద్దు'' అని ఆ నలుగుర్ని గట్టిగా కోప్పడి పంపించేశాడు.

''ఇదేమిటి విశ్వనాథం?'' అడిగాను.

''ఈ మధ్య అన్నయ్యకి డబ్బు పిచ్చి పట్టిందిలెండి! అన్నీ ఇలాంటి పనులే చేస్తున్నాడు'' అన్నాడు




విశ్వనాథం కాస్త కోపంగానూ, రవ్వంత విరాగ్గానూ.

''నాకేమీ అర్థంకావడం లేదు. కాస్త వివరంగా చెప్పు. వాడు చెప్తాడని నాకు నమ్మకం లేదు. నిన్న నా మీద యుద్ధం ప్రకటించాడు. నేను...''

''తెలుసులెండి! అసలు ఈ చెట్టు ధర ఎంతో అన్నయ్యకి ఎప్పుడో తెలుసు! మిమ్మల్ని అడ్డంపెట్టుకుని తను చవగ్గా కొనేసి .. కొనేసి ఏమిట్లెండి కొట్టేసి తను మళ్ళీ ఎక్కువ ధరకి అమ్మేయాలని అన్నయ్య ప్లాను. ఎంత తక్కువయినా ఎలాగోలా మీరు తనకే ఇస్తారని అన్నయ్యకి బాగా నమ్మకం! ఆ నమ్మకంతోనే వాళ్ళకి పదిహేను వందలకి అమ్మేసినట్టు మాటిచ్చేశాడు''.

''అదా సంగతి!'' ఆశ్చర్యంతో నా నోట మాట రాలేదు.

ఇంతకాలం మా స్నేహంలో మచ్చ అనేది లేదు అని ఎంత పొంగిపోయానో ఇప్పుడంత క్రుంగిపోయాను.

మాకు జ్ఞానం తెలిసినప్పటినుంచీ మేమిద్దరం ఒకళ్ళకొకరం తెలుసు. బాల్యంలో ఆటలతో మొదలైన మా స్నేహం క్రమంగా మాతో బాటు పెరిగి పెద్దదయి గాఢమైన మైత్రిగా చెట్టు మానులా బలపడింది. ఇద్దరిలో ఒకరంటే ఒకరికి ఉన్న అభిమానం వల్ల వాడు నాకు పరాయివాడులా అనిపించడు. మా ఇద్దరికీ పెళ్ళిళ్లయి, పిల్లలు పుట్టి పెద్దవాళ్ళయినా మాలో మార్పులేదు. నా ఇంట్లో కష్టం వచ్చినా, శుభం జరిగినా కనిపెట్టి వచ్చి వాలేవాడు. నాకు కుడిభుజంలా ఉండే వాడు. నేనూ అంతే! వాడికి డబ్బు అవసరం పడినట్లు చూచాయగా గ్రహించినా చాలు... నా చేతిలో లేకపోయినా నాకున్న పరపతితో ఎక్కడో ఒకచోట అప్పు పుట్టించి వాడి అవసరం తీర్చేవాడిని. ఇంతకాలం మా మధ్య నేను—నువ్వు అనే తేడాయే లేనట్టు ఉన్నాము. ఈ సంగతి ఊరంతా తెలుసు! అలాంటిది వాడిలో ఎప్పుడు ఇలాంటి మార్పు వచ్చిందో ఇంత డబ్బు మనిషి ఎలా అయ్యాడో నాకు తెలియడం లేదు. 'డబ్బు ఇంతటి స్నేహాన్ని కూడా బలిచేయగలదా? 'సృష్టిలో తీయనిది స్నేహమే' నంటారు. కాదు! అది సరి కాదు! 'సృష్టిలో తీయనిది ధనమే' నేమో అనిపిస్తోంది. 'నిజానికి ఇపుడు మిత్రద్రోహం చేసింది ఎవరు? నాకు చాలా బాధగా ఉంది! ఈ బాధనుంచి కోలుకోడానికి వ్యవధి కావాలి నాకు!

గౌరీపతి తమ్ముడు విశ్వనాథం ఇంకా ఏదో చెప్తూనే ఉన్నాడు. వినిపించుకోకుండా వెను తిరిగాను నేను!

## వాడు

వాడు రైల్లో చిమ్మే చీపురయి వస్తాడు
ప్రతీ పెట్టెకూ నడిచే పాటయివస్తాడు
శివకాశిలో సీమ టపాసులయిపోతాడు
కలకత్తాలో కాలిబూటు పాలిషయిపోతాడు
మార్కాపురంలో కాలికింద పడి పగిలిన
పలకయిపోతాడు
చౌరస్తాలో టీబంకుల దగ్గర కడిగే కప్పుల మురికి
నీళ్లలోంచి కదలని ప్రతిబింబమయిపోతాడు
ఊరవతల గుడిమెట్ల దగ్గర బిచ్చగాని చేతిలో
చిప్పయిపోతాడు
బతుకుబడిలో వాడు ఘోరంగా చిత్తయిపోతాడు.
వాడు ఈ దేశంలో ఓ బాలుడు
ఎర్రబడ్డ వాడికళ్లలోకి చూడు
కనిపిస్తాడు కోటి ప్రశ్నల సూర్యుడు.

— పక్కి రవీంద్రనాథ్